క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలను గురువారం నోడల్ ఆఫీసర్ సిద్ధార్థ్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సరుకులు, వంట గది పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల శుభ్రతపై సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారి కవితారాణి, ప్రిన్సిపాల్ అనిత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఎల్కతుర్తి : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ తండ్రి రాములు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం



నల్లబెల్లి : పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు ఎర్ర నాగరాజు, కొండ నారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశాలకు తిరుపతిరెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలిచే దిశగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకుడు చార్ల శివారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు వైనాల అశోక్, ఇస్తారి శేఖర్, ప్రధాన కార్యదర్శి మాలోత్ మోహన్, బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతిరావు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులతో జాగ్రత్త



వర్ధన్నపేట : అసంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) వైద్యాధికారి నేహా ఫాతిమా కోరారు. మండలంలోని ఎస్ఎస్ తండాలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆమె పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మధుమేహం, రక్తపోటు, కేన్సర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులను అసంక్రమిత వ్యాధులుగా గుర్తించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, శుభ్రమైన ఆహారం తీసుకోవాలని, ఒత్తిడికి దూరంగా ఉండాలని, తదితర సూచనలు చేశారు. కార్యక్రమంలో రాయపర్తి ఎంఎల్‌హెచ్‌పీ జ్ఞానసుందరి, సీహెచ్‌ఓ కమలా గ్రేస్, హెచ్‌వీ జి.స్వర్ణకుమారి, హెచ్‌ఏ మత్యాస్ శ్యామ్, ఏఎస్‌ఎంలు అరుణ, అనిత, ఆశవర్కర్లు ఉమ, భాగ్య, అరుణ, సంధ్య, అనసూయ, పాల్గొన్నారు.

డిగ్రీలో చేరేందుకు మరో అవకాశం

పరకాల : డిగ్రీలో చేరేందుకు విద్యార్థులకు మరో అవకాశాన్ని ఉన్నత విద్యామండలి కల్పించిందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతి సంతోశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దోస్త్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థులు స్పెషల్ ఫేజ్ ద్వారా ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు దరకాస్తు చేసుకోవచ్చని, వెబ్ ఆప్షన్స్ కూడా అదే తేదీల్లో ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఆగస్టు 3న సీటు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 3 నుంచి ఆగస్టు 8లోపు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని సూచించారు.

ప్రారంభానికి నోచుకోని గ్రంథాలయం

- సాయమందిస్తామని ముందుకొస్తున్న పలువురు ఉద్యోగులు
- భవనం ఉన్నప్పటికీ దృష్టిసారించని పాలకులు, అధికారులు
- నిరుద్యోగులు, యువకుల అసహనం



గ్రంథాలయం ఏర్పాటు కోసం ఖాళీ చేసిన మహిళా సమాఖ్య భవనం

ఐనవోలు : మండల ప్రజలకు గ్రంథాలయ సేవలు దూరమయ్యాయి. మండల కేంద్రంలో గ్రంథాలయ ఏర్పాటుకు గతంలో కేటాయించిన భవనం అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో గ్రంథాలయ సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో గ్రంథాలయానికి పదుల సంఖ్యలో పాఠకులు వస్తుండగా అందులో దినపత్రికలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్, ఇతరత్రా పుస్తకాలు ఉండేవి. మండల కేంద్రంలో భవనాల కొరత ఉండడంతో మహిళ సమాఖ్యకు ఆ భవాన్ని అప్పటి పాలకులు కేటాయించారు. అందులోవున్న ఫర్నీచర్‌తో పాటు పుస్తకాలు మాయమై గ్రంథాలయం మూతబడింది. అయితే కొంత కాలంగా యువకులు గ్రంథాలయాన్ని పునరుద్ధరించాలని, మహిళ సమాఖ్యను మరో చోటుకు మార్చాలని అధికారులకు వినతులు అందించడంతో పాటు ఒత్తిడి తేవడంతో మహిళ సమాఖ్య ప్రతినిధులు ఆ భవనాన్ని ఖాళీ చేసి మరో చోటుకి తరలించారు. ప్రస్తుతం గ్రంథాలయ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు, నాయకులకు ముందుకురావడం లేదని గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆగ్రహిస్తున్నారు. అయితే గ్రంథాలయాన్ని మళ్లీ ప్రారంభించేందుకు అవసరమయ్యే సామగ్రి అందించేందుకు అదే గ్రామం నుంచి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన పలువురు ముందుకొస్తున్నట్లు తెలిసింది. గ్రామాల్లో గ్రంథాలయం లేకపోవడంతో అనేక మంది పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టణాల బాట పడుతున్నారు. దాతల సహకారాన్ని సమన్వయపరిచి అధికారులు, ప్రజాప్రతినిధులు మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ప్రారంభించాలని పలువురు నిరుద్యోగ యువకులు కోరుతున్నారు.



గతంలో కేటాయించిన గ్రంథాలయ భవనం

పాలకులు సైతం దృష్టిసారించి గ్రంథాలయ ప్రారంభానికి కృషి చేయాలని అంటున్నారు.

నిరుద్యోగులకు గ్రంథాలయం అవసరం



మండల కేంద్రంలో గ్రంథాలయం ఉంటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఇంటర్ పూర్తిచేసి వివిధ కారణాలతో కుల వృత్తి చేసుకుంటూ ఓపెన్ డిగ్రీ చేస్తున్నాను. నోటిఫికేషన్లకు దరఖాస్తు చేసుకుని ప్రిపేర్ కావాలని ఉంది. అందుకు తగిన అవకాశాలు మండల కేంద్రంలో ఉంటే నా లాంటి వారికి ఎంతో ఉపయోగం. గ్రంథాలయాన్ని మళ్లీ ప్రారంభిస్తే నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యార్థులకు పఠనాసక్తి పెంపొందుతుంది.

– దొంతూరి రాకేష్, ఐనవోలు

గ్రంథాలయం ప్రారంభించాలి



మండల కేంద్రంలో గ్రంథాలయాన్ని ప్రారంభించాలి. మా గ్రామానికి చెందిన పలువురు ఉద్యోగులు గ్రంథాలయ ప్రారంభానికి కృషిచేస్తామని ముందుకు వస్తున్నారు. గ్రంథాలయానికి పుస్తకాలు, సామగ్రి అందిచేందుకు సిద్ధంగా ఉన్నారు. భవనం కూడా రెడీగా ఉంది. గ్రంథాలయం ఉన్నప్పుడు రోజు వెళ్లి బుక్స్, న్యూస్ పేపర్ చదివే వాళ్లం. ప్రస్తుతం మండల కేంద్రంలో గ్రంథాలయం లేకపోవడంతో చదవడం లేదు.

– గడ్డం రఘువంశీ, పాఠకుడు, ఐనవోలు

పింఛన్‌దారుల సదస్సుకు తరలిరావాలి



మాట్లాడుతున్న నాయకులు

ఐనవోలు : ఈనెల 29వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన పింఛన్‌దారుల సదస్సుకు తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాజన సోషలిస్టు పార్టీ అధ్యక్షుడు, హనుమకొండ, వరంగల్, జనగాం జిల్లాల ఇన్‌చార్జ్ వైకె విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో పింఛన్‌దారుల గ్రామకమిటీ సమావేశం జరుగగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్నతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, బీడీ కార్మికులకు అందిస్తున్న పింఛన్‌ను వెంటనే పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పింఛన్ల పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 29వ తేదీన వరంగల్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ పింఛన్‌దారుల సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతీ గ్రామం నుంచి 100 మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. అదే విధంగా ఆగస్టు 13న హైదరాబాద్‌లో లక్షలాది మందితో నిర్వహించే వికలాంగుల చేయూత ఆసరా ఫించన్ల మహా గర్జన సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణ, ఏలియా, కుమారస్వామి, ప్రభాకర్, సుధాకర్, యాకూబ్, హరీష్, పాషా, యాదమ్మ, సుశీల, శశిరేఖ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం దొంగలుగా చిత్రీకరించింది

- నాపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు
- ఐఎంఏ హాల్‌లో సమావేశంలో ఐనవోలు తహసీల్దార్ విక్రమ్



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్లు

రామన్నపేట: గత ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించిందని, నిజాయితీ, నిబద్ధతతో ఉద్యోగం చేస్తున్న తమపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తహసీల్దార్లు పేర్కొన్నారు. వరంగల్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐనవోలు తహసీల్దార్ విక్రమ్ మాట్లాడుతూ.. తనపై ఎలాంటి అవినీతి, ఆరోపణలు లేవని స్పష్టం చేశారు. నిరాధారమైన ఆరోపణలతో కొంతమంది తనను మానసికంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరణి స్థానంలో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురావడంతో తమపై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై ఎలాంటి ఫిర్యాదు చేయాలనుకున్నా కలెక్టర్‌కు చేయవచ్చని అన్నారు. సమావేశంలో తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, కె.విక్రమ్‌కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి లక్ష బిల్వార్చన



ఎల్కతుర్తి: హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ధర్మసాగర్‌లో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో గురువారం ఆషాఢమాసం అమావాస్య సందర్భంగా వీరభద్రుడికి ఆలయ అర్చకులు లక్ష బిల్వార్చన, చండీ హోమం నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, నిత్యపాసన, మంత్రపుష్పం, లక్ష బిల్వాలతో అర్చనలు చేశారు. అనంతరం చండీహోమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు రాజయ్య, రాంబాబు, సందీప్, శ్రీకాంత్, వినయ్‌శర్మ పాల్గొన్నారు.

ధర్మసాగర్ : క్యాతంపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో 41వ రుద్ర సహిత చండీ హోమం నిర్వహించారు. ఈ నెల 29న నాగపంచమి సందర్భంగా నవనాగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భద్రకాళి శేషు ఆధ్వర్యంలో శతఘటాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

యువతకు మార్గదర్శి కేటీఆర్



ఎల్కతుర్తి : కేక్ కట్‌చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



శాయంపేటలో..

నేటి యువతకు మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు మార్గదర్శి అని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. గురువారం కేటీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ధర్మసాగర్, శాయంపేట, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, నడికూడ, ఆత్మకూరు, వేలేరు, ఐనవోలు, పరకాల, కమలాపూర్ మండలాల్లో కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

దామెర : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని డిస్నీల్యాండ్ పాఠశాల యాజమాన్యం సూచించింది. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల డిస్నీల్యాండ్ పాఠశాలలో గురువారం మాక్ పోలింగ్ నిర్వహించగా విద్యార్థులు ఓటుహక్కు వినియోగించుకుని లీడర్లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో బాయ్స్ ప్యూపుల్ లీడర్‌గా హృతిక్, డిప్యూటీ ప్యూపుల్స్ లీడర్‌గా రామ్‌చరణ్, గర్ల్స్ ప్యూపుల్ లీడర్‌గా మధుశ్రీ, డిప్యూటీ లీడర్‌గా చరణి గెలుపొందారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు మల్లయ్య, సదయ్య, లక్ష్మీనివాసం మాట్లాడుతూ.. ప్రతి భారతీయుడు నిస్వార్థంగా ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో రాజకీయ నాయకులుగా ఎదిగి ప్రజలకు, దేశానికి సేవచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం లీడర్లుగా ఎన్నికైన విద్యార్థులను అభినందించారు. సమావేశంలో డైరెక్టర్లు శోభారాణి, రాకేశ్‌భాను, దీనేశ్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌యాదవ్‌కు డాక్టరేట్



ధర్మసాగర్ : మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన దబ్బేట రమేశ్‌యాదవ్ ఆంగ్లం(ఇంగ్లిష్)లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ప్రొఫెసర్ అనుముల శ్రీదేవి పర్యవేక్షణలో సోషల్ రియలిజమ్ ఏ కంపారేటివ్ స్టడీ ఆఫ్ దా సెలెక్ట్ నావల్స్ ఆఫ్ మైఖేల్ చాబోన్ అండ్ జోనాథన్ సఫ్రాన్ ఫోయర్ అనే పరిశోధనా గ్రంథాన్ని సమర్పించగా ఆయనకు డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా రమేశ్‌యాదవ్‌కు అధ్యాపకులు, గ్రామసస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

కేజీబీవీలో స్పాట్ అడ్మిషన్లు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 10సీట్లు, 7వ తరగతిలో 5సీట్లు, ఇంటర్ ఎంపీసీలో 10, బైపీసీలో 10సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

రోటరీ క్లబ్ బాధ్యుల ప్రమాణ స్వీకారం



నర్సంపేట : రోటరీ క్లబ్ స్థానిక ప్రెసిడెంట్‌గా బాదం రంజిత్‌కుమార్, సెక్రటరీగా శ్రీరాం కిరణ్, కోశాధికారిగా డాక్టర్ పడాల రాహుల్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ భరత్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ నరేశ్ హాజరై మాట్లాడారు. అనంతరం మండలంలోని నాజితండాలోని ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు బుక్కులు, పెన్నులు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రెసిడెంట్ రంజిత్‌కుమార్ మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తామన్నారు. అనంతరం క్లబ్ బాధ్యులను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంది గోపాల్‌రెడ్డి, నంద్యాల కృష్ణారెడ్డి, గోపు జైపాల్‌రెడ్డి, ఇరుకు కోటేశ్వర్‌రావు, మోతె జైపాల్‌రెడ్డి, బి.సుమన్, నామాల సత్యనారాయణ, సిద్ద సుధాకర్, చకిలం కృష్ణమూర్తి, తదితరులు హాజరయ్యారు.

బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించాలి

- ఆర్డీఓ డాక్టర్ నారాయణ



మాట్లాడుతున్న ఆర్డీఓ డాక్టర్ నారాయణ

పరకాల : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని, అందుకోసం అన్ని రాజకీయ పార్టీలు బూత్‌ల వారీగా ఏజెంట్లను నియమించుకోవాలని పరకాల ఆర్డీఓ డాక్టర్ నారాయణ సూచించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పర కాల తహసీల్దార్ విజయలక్ష్మి, ఏఈఆర్‌ఓ సూర్యప్రకాశ్, నాయబ్ తహసీల్దార్ భద్రయ్య, సీనియర్ సహాయకుడు రాంబాబు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా



ధర్మసాగర్ : రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆదిరెడ్డి



శాయంపేట : నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

ధర్మసాగర్ / వేలేరు : మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని సహాయ వ్యవసాయ సంచాలకుడు (ఏడీఏ) ఆదిరెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువుల దుకాణంతోపాటు వేలేరు మండలంలోని పలు గ్రామాల్లో గల ఎరువుల దుకాణాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరానికి కంటే ప్రస్తుతం 30 శాతం యూరియా అధికంగా సహకార సంఘాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. యూరియా కొరత ఉందనే పుకార్లు నమ్మవద్దని రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల్లో నానో యూరియా వినియోగించాలని, పంటలపై పిచికారి చేస్తే మంచి ఫలితం ఉంటుందని అన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారులు రాజేష్, కవిత, ఏఈఓ దివ్య ఉన్నారు.

శాయంపేట : మండలంలోని నూర్జహాన్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఏడీఏ శ్రీనివాస్ నానో యూరియా, నానో డీఏపీ వినియోగంపై రైతులు అవగాహన కల్పించారు. నానో యూరియా, డీఏపీతో అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ కాలుష్యాన్ని తగ్గిస్తాయని అన్నారు. అలాగే రైతులు ఆయిల్ పామ్ పంటను సాగుచేసి అదనపు ఆదాయాన్ని పొందాలన్నారు. ప్రగతి సింగారం గ్రామంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో 40 టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. ఏఈఓ సుప్రియ, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ యాదగిరి హెచ్చరించారు. గురువారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో గల రికార్డులను పరిశీలించారు. గడువు ముగిసిన పురుగుమందులను విక్రయించొద్దన్నారు.

పదో తరగతి విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లతో విద్యార్థిని, విద్యార్థులు

కమలాపూర్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూల్, మర్రిపల్లిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 148 మంది విద్యార్థులకు బీజేపీ మండల అధ్యక్షుడు ర్యాకం శ్రీనివాస్ గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ జన్మదిన వేడుకల సందర్భంగా మోదీ గిఫ్ట్ అనే క్యాక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరు అయ్యేందుకు సౌకర్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో బండి సంజయ్ ఆలోచన మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శోభన్‌బాబు, ప్రభాకర్‌రెడ్డి, రాజు, రాంబాబు, సంపత్, చైతన్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



శాయంపేట : తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



పరకాల : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాయంపేట : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమారస్వామి, రమేశ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పరకాల : పెండింగ్‌లో ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు మేరుగు ప్రసన్న డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ విజయలక్ష్మికి ఉపాధ్యాయ సంఘాల కమిటీ(యూఎస్‌పీసీ) నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ సంఘాల కమిటీ నాయకులు రవి, రవీందర్, మహేందర్‌సింగ్, రమేశ్, రజీయా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

నడికూడ : ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షడ్యూల్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ కమిటీ రాష్ట్ర నాయకుడు సన్నెబోయిన తిరుపతి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేశ్, మండల నాయకులు శ్రీనివాస్, సుభాని, రవీందర్, కృష్ణంరాజు, విక్రమ్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీఓలో సభ్యత్వ నమోదు



రైతులకు సభ్యత్వం అందజేస్తున్న చైర్మన్ శరత్

శాయంపేట : మండలంలోని మైలారంలో పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, వైస్ చైర్మన్ దూదిపాల తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రైతులు గురువారం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లో రూ.1000 చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. చైర్మన్ శరత్ మాట్లాడుతూ.. మండలంలోని రైతులు ఎఫ్‌పీఓ స్కీమ్ లో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. రైతులు సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలని కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.